క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: చందంపేట మండలం ముడుదండ్ల గ్రామానికి చెందిన పలువురు బుధవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల సర్వయ్య, రాజవర్ధన్, దొండేటి మల్లారెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులున్నారు.

'గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్'ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల కోసం దసరా దమాకగా ప్రవేశపెట్టిన 'గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్'ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ కోరారు. బుధవారం స్థానిక డీఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21, 22, 23, తిరిగి 28, 29, 30వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు టికెట్‌పై ఫోన్‌నంబర్ రాసి జనరేటింగ్ పాయింట్ వద్ద గల బాక్స్‌లో వేయాలని పేర్కొన్నారు. లక్కీ డ్రీమ్‌లో భాగంగా రూ.11లక్షల నగదు బహుమతిని 110 మంది వరకు అందించడం జరుగుతుందని తెలిపారు.

రామ్మూర్తి యాదవ్‌కు నివాళి



రామ్మూర్తి యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంజిత్ యాదవ్

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లిలో బుధవారం మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్ యాదవ్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కట్టిబోయిన అనిల్ కుమార్, గుండెబోయిన కోటేష్ యాదవ్, నగేష్, కుంటిగొర్ల రాజా శేఖర్, బుడిగ శ్రీను, సురేష్, మల్లె వెంకన్న, బయ్య వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాములు కుటుంబానికి పరామర్శ

పెద్దవూర: మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గునమోని జంగయ్య యాదవ్ తండ్రి గునమోని రాములు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్, పీసీసీ అధికార ప్రతినిధి కర్నాటి లింగారెడ్డి బుధవారం పోతునూరులోని ఆయన నివాసానికి వెళ్లి రాములు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, నాయకులు పగడాల నాగరాజు, కోట నాగిరెడ్డి, గునమోని వెంకటేశ్వర్లు, రేపాకుల సాయికుమార్, ఎల్లయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకాలు ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో గల శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఊరె జనార్దన్, గౌరు వెంకటేశ్వర్లు, చల్ల ధనుంజయ, గుమ్మడవెల్లి జనార్దన్, నీల లక్ష్మయ్య, నీల విజయ్, వీరమళ్ల వెంకటయ్య, సముద్రాల ధనయ్య, అంకిశెట్టి శేఖర్, విడియాల రామయ్య, పంపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు టికెట్ ముదిరాజ్‌లకు ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : మునుగోడు నియోజకవర్గ టికెట్ ముదిరాజ్‌లకు కేటాయించాలని ముదిరాజ్ సంఘం నాయకులు రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముదిరాజ్ కులస్తుల సమ్మేళనంలో వారు మాట్లాడారు. ఈ నెల 15న చండూరులో జరగనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు ముదిరాజ్ కులస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రమాదకరంగా బావులు



పర్వేదుల రోడ్డులోని కల్వర్టు సమీపంలో రక్షణ గోడ లేకుండా ఉన్న బావి

- రక్షణ గోడలు లేకుండా రహదారుల వెంట బావులు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు

పెద్దవూర: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఆనుకునే రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా బావులు ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పర్వేదుల నుంచి నాయినవానికుంట తండా, నాయినవానికుంట గ్రామాల మీదుగా మండల కేంద్రమైన పెద్దవూరకు గత ఎనిమిది సంవత్సరాల క్రితం రూ.1.20 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు వేశారు. ఈ రహదారి పక్కనే నాయినవానికుంటతండా సమీపంలో నాలుగు ప్రదేశాల్లో వ్యవసాయ బావులు రోడ్డు అంచును ఆనుకుని రక్షణ గోడలు లేకుండా అతి ప్రమాదరకంగా ఉన్నాయి. ఒక ప్రదేశంలో రోడ్డుకు రెండువైపులా రెండు బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. అదేవిధంగా తంగెళ్లతండా–పాల్తీతండా రహదారిపై రోడ్డుకు ఇరువైపులా రెండు పెద్ద పెద్ద బావులు ఉన్నాయి. మూలమలుపులు ఉన్న ప్రదేశాల్లో దగ్గరికి వచ్చే దాక బావులు కనిపించవు. ఈ రహదారిలో నిత్యం పాఠశాల బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది. అధికారులు స్పందించి బావులకు రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి



కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు వేసినా రోడ్డును ఆనుకుని ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. పెద్దవూర– పర్వేదులకు బీటీ రోడ్డు వేశాక మండల కేంద్రానికి వెళ్లటానికి పది గ్రామ పంచాయతీలకు సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరం తగ్గుతుండటంతో రద్దీగా ఉంటుంది. దీనికితోడు స్కూల్ బస్సులు, లారీలు, ఆటోలు, ద్వి చక్రవాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రక్షణ గోడలు లేకపోవడం, రోడ్డు ఇరుకుగా ఉండటంతో బావుల వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయంగా ఉంటుంది. రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– రమావత్ శ్రీరాములు, ఎంపీటీసీ, జయరాంతండా



నాయినవానికుంట తండా సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బావి



పర్వేదుల రోడ్డులో మూలమలుపు వద్ద రక్షణ గోడ లేకుండా ఉన్న బావి



పర్వేదుల నుంచి పెద్దవూర వెళ్లే దారిలో రహదారికి ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న బావి

గుడుంబా అమ్మితే కేసులు నమోదు చేస్తాం



బడాయిగడ్డలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

త్రిపురారం : గ్రామాల్లో గుడుంబా కాసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ కల్పన అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని మాటూర్, లోక్యా తండా, బడాయిగడ్డ గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు త్రిపురారం పోలీసులతో కలిసి విస్తృతంగా తనిఖీలు చేశారు. గుడుంబా తయారు చేస్తూ పట్టుబడితే ఎన్నికల నిబంధనల ప్రకారం జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు విజయ్, రేఖ, త్రిపురారం ఏఎస్సై రామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

నిడమనూరు: మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీ విద్యార్థులు కొప్పెర రమ్య, గాదె అంజలి, యంద్రు మనూష, కాస్య ఇందులకు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ అందించే స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రంజిత బుధవారం తెలిపారు. వీరికి డిగ్రీ స్థాయిలో సంవత్సరానికి రూ.10 వేలు, పీజీ స్థాయిలో సంవత్సరానికి రూ. 20వేల స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరుకల సంఘం మండల అధ్యక్షుడిగా రామోజీ

గుర్రంపోడు: ఎరుకల సంఘం మండల అధ్యక్షుడిగా పిట్టల రామోజీ ఎన్నికయ్యారు. బుధవారం గుర్రంపోడులో సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు రుద్రాక్ష వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి మురళి, పిట్టల నాగరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

హాలియా: సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక హాలియా పబ్లిక్ స్కూల్ విద్యార్థి యడవెల్లి మణితేజ్ ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మణితేజ్‌ను కరస్పాండెంట్ మేడిపల్లి మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు గోపినాయర్, పీఈటీ యడవెల్లి రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న పాస్టర్లు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని బాపూజీనగర్ దుబ్బతండాలో బుధవారం నియోజకవర్గంలోని మానసిక వికలాంగులకు విశ్వస పరిచర్య ప్రార్థనా మందిరం వద్ద నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ధీరావత్ హన్యానాయక్, రమాబాయి, సుధారాణి, రమేష్, రాజు తదితరులున్నారు.

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని భువగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ మండలంలోని జీకే అన్నారం, అన్నారెడ్డిగూడెం, ముశంపల్లి, ఐతవారిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్న వారికే దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు అందజేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఏ పార్టీ అని చూడకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేశామని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తాయని అన్నారు. నిధులు, నియామకాలు, నీళ్లు, ఇంటికో ఉద్యోగం అని చెప్పి సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. జండూ బామ్‌లతో ఎడవడం, నటించడం తనకు రాదని, పేదల కన్నీళ్లు తూడవడం మాత్రమే తనకు తెలుసని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 75 స్థానాల్లో విజయ ఢంకా మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీటీసీ బీరం స్వాతి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య కార్యకర్తలతో కోమటిరెడ్డి సమావేశం

రామగిరి(నల్లగొండ): ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల ముఖ్య కార్యకర్తలు, అనుచరులతో తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయం



మందులు అందజేస్తున్న కేంద్ర మంత్రి శోభ కరాండ్లజే

నల్లగొండ టూటౌన్ : పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభ కరాండ్లజే అన్నారు. నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని క్రాంతినగర్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యశిబిరానికి హాజరైన వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మంత్రి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, డాక్టర్ సాహిత్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, పకీరు మోహన్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- ఆర్డీఓ చెన్నయ్య



మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ: రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు, వృద్ధులు, వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 31లోపు ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ తేదీ కంటే ఐదు రోజులు ముందుగా ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లే వాహనదారులు తప్పనిసరిగా వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించాలన్నారు. రాజకీయ నాయకులు ర్యాలీలు, మైక్ సెట్ ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



పంగవానికుంటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకురాలు కంకణాల నివేదితారెడ్డి

హాలియా: రానున్న ఎన్నికల్లో సాగర్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకురాలు కంకణాల నివేదితారెడ్డి కోరారు. బుధవారం అనుముల మండలంలోని పంగవానికుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశ సమగ్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు నాగార్జున్‌రెడ్డి, అనుముల మండల అధ్యక్షుడు శంకర్, జనరల్ సెక్రటరీ నాగరాజు, బూత్ అధ్యక్షుడు నీలం శ్రీను, నాయకులు సురభి మధు, శ్రీధర్, చందు, మణికంఠ, పట్టణ అధ్యక్షుడు నంద్యాల ప్రవీణ్‌కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పునీత్, ఎస్టీ మోర్చ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వాలను ఓడించాలి



మాట్లాడుతున్న రొండి శ్రీనివాస్

వేములపల్లి: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రొండి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న పాలకులను ఓడించి అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతూ ప్రశ్నించే గొంతుకలైన కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చింతకుంట్ల లక్ష్మమ్మ, చింతకుంట్ల రాములు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



మిర్యాలగూడలోని పాపోసులదిబ్బలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ మమత

మిర్యాలగూడ టౌన్: ఆడపిల్ల సృష్టికి మూలం అని, వారిని రక్షించుకుందామని సీడీపీఓ మమత అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని గాంధీనగర్ సెక్టార్ పరిధిలో ఉన్న పాపోసులదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆడపిల్లలను రక్షించుకుందాం' అని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల కోసం అనేక చట్టాలను తీసుకువచ్చాయని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేసి ఇబ్బందులకు గురి చేయొద్దని, 18 ఏళ్లు నిండిన తరువాతే చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీ టీచర్ తూడి అరుణ, హెల్పర్ లక్ష్మీకాంతం తదితరులున్నారు.

బాలికలు చదువులో రాణించాలి

పెద్దవూర: బాలికలు చదువులో రాణించాలని అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని చలకుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు ఆటలు, క్విజ్, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఆమె మాట్లాడుతూ సమసమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదన్నారు. బాలికలు స్వయం సమృద్ధి సాధించాలని తెలిపారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తుండడం హర్షణీయమన్నారు. ప్రభుత్వాలు సైతం మహిళల సంక్షేమానికి పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, ఆడపిల్లల విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌషియాబేగం, అంగన్‌వాడీ టీచర్లు శాంత, యాదమ్మ, మంగమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దవూర: చలకుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో..



అడవిదేవులపల్లిలో విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అడవిదేవులపల్లి: అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, నారాయణమ్మ, శోభ, రమాదేవి, మణెమ్మ, రేణుక, కిశోర బాలికలు తదితరుతులున్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యూత్ ఫర్ సేవా వలంటీర్లు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం యూత్ ఫర్ సేవా సహకారంతో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ (ఎన్‌ఎంఎంఎస్) మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌లో ప్రతిభ చాటాలన్నారు. యూత్ ఫర్ సేవా వలంటీర్ కొత్త అఖిల్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమవంతుగా సహాయ, సహకారాలు అందించేందుకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎంఎంఎస్ కోఆర్డినేటర్ సైదానాయక్, కొర్ర లోక్యానాయక్, శ్రీనయ్య, జగదీశ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గుర్రంపోడు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా టీబీ వ్యాధి నుంచి దూరం కావచ్చని పీఎంజేఎఫ్ లయన్ కోడె సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ నల్లగొండ గెలాక్సీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు గత నెల నుంచి పోషకాహార కిట్లు అందిస్తున్నామన్నారు. మరో ఆరు నెలలపాటు కిట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ లయన్స్ క్లబ్ గెలాక్సీ ప్రధాన కార్యదర్శి మారెడ్డి వెంకట్‌రెడ్డి, కోశాధికారి ఎర్రబెల్లి కోటిరెడ్డి, కోఆర్డినేటర్ వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మారెడ్డి గిరిధర్‌రెడ్డి, డాక్టర్ భవానీ చక్రవర్తి, వైద్యసిబ్బంది తెలిపారు.

బంజారా భవన్ కట్టాలన్నదే ఎమ్మెల్యే లక్ష్యం

- అఖిల భారత బంజారా సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు భిక్షానాయక్



హాలియాలో సమావేశమైన అఖిల భారత బంజారా సేవా సంఘం నాయకులు

హాలియా: ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే బంజారా భవన్ నిర్మాణ పనులు ఆగిపోతాయేమోనని ఎమ్మెల్యే నోముల భగత్ శిలాఫలకం లేకుండా శంకుస్థాపన చేశారని, వేరే ఉద్దేశం కాదని అఖిల భారత బంజారా సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు కేతావత్ భిక్షానాయక్ అన్నారు. బుధవారం హాలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారా భవన్ నిర్మాణం చేపట్టాలనే ఏకైక లక్ష్యంతోనే ఎమ్మెల్యే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు తప్పు పట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు గిరిజనులను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ఇచ్చిన హామీ మేరకు ఆయన తనయుడు నోముల భగత్ హాలియాలో బంజారా భవన నిర్మాణం కోసం ఎకరం స్థలం ఇవ్వడంతో పాటు భవన నిర్మాణానికి రూ. 4 కోట్లు నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అఖిల భారత బంజారా సేవ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జటావత్ రవినాయక్, జిల్లా కార్యదర్శి రమావత్ రవినాయక్, శంకర్‌నాయక్, శివాజీనాయక్, హనుమంతు తదితరులున్నారు.

కాంగ్రెస్ వైపు స్థానిక నేతల చూపు!

పెద్దవూర: మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటున్నప్పటికీ ఎమ్మెల్యే హాజరయ్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తనదైన శైలిలో పావులు కలుపుతూ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సర్పంచ్‌లు, మండల స్థాయి ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సమాచారం. వీరంతా త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరతారని ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. మండలంలో ఎవరెవరు కాంగ్రెస్‌లో చేరతారనే విషయం హాట్ టాపిక్‌గా మారింది.

టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు ముమ్మరం



టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మిర్యాలగూడ టౌన్: సాధారణ ఎన్నికల నిబంధనల్లో భాగంగా మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్ ప్లాజా వద్ద మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు ముమ్మరం చేశారు. నల్లగొండ– సూర్యాపేట జిల్లా సరిహద్దు కావడంతో సూర్యాపేట జిల్లా నుంచి నల్లగొండ జిల్లాకు, నల్లగొండ జిల్లా నుంచి సూర్యాపేట జిల్లాకు వెళ్లే వాహనాలన్నింటిని పోలీసులు తనిఖీ చేస్తున్నారు.

ఖాతాదారులకు చేరువలో సహకార బ్యాంకు



మొబైల్ ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేస్తున్న రైతు

రామగిరి(నల్లగొండ) : సహకార బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మరిన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని తిప్పర్తి సహకార సంఘం చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లిలో కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా నూతనంగా యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. బ్యాంకులో అన్ని రకాల రుణాలు పొందే సదుపాయం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానయ్య, నల్లగొండ బ్రాంచ్ మేనేజర్ వి.భాగ్యశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, తిప్పర్తి సంఘ కార్యదర్శి అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.